క్లుప్తంగా

కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభం



నిజాంసాగర్: దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మహమ్మద్‌నగర్ మండలంలోని నర్వ గ్రామంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం కబడ్డీ టోర్నమెంట్ సీజన్-3ని ప్రారంభించారు. గెలుపొందిన జట్లకు నగదు బహుమతి అందించనున్నట్లు టోర్నీ నిర్వాహకుడు హరీశ్‌గౌడ్ తెలిపారు.

హైమాస్ట్ లైట్లకు మరమ్మతులు



ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో హైమాస్ట్ లైట్లకు మరమ్మతులు చేయించినట్లు మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ బుధవారం తెలిపారు. పట్టణంలోని ఫైర్ స్టేషన్, పోలీస్‌స్టేషన్, గాంధీచౌక్, డెయిలీ మార్కెట్, మున్సిపల్ కార్యాలయం, అంబేద్కర్ చౌరస్తాల్లో పాడైన హైమాస్ట్ లైట్లకు మరమ్మతులు చేయించి వాటిని ప్రారంభించారు. కౌన్సిలర్ నీలకంఠం, నాయకులు విద్యాసాగర్, శ్రీనివాస్, పోచయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

జెండా ఉత్సవాలు ప్రారంభం



రాజంపేట: మండల కేంద్రంలో దసరా పండుగను పురస్కరించుకొని జెండా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు సత్యం పటేల్, కాసం రాములు బుధవారం తెలిపారు. గ్రామ చావిడి వద్ద పెద్ద కర్రను ఏర్పాటు చేసి అందంగా అలంకరించి దసరా రోజున మూడు రంగుల జెండాను గ్రామస్తులతో కలిసి ఎగురవేయనున్నట్లు పేర్కొన్నారు.

ఆలయానికి రథం బహూకరణ



బాన్సువాడ: పట్టణంలోని కోటదుర్గమ్మ ఆలయానికి బాసం వెంకటలక్ష్మి-కాశీనాథ్, బాసం అనురాధ-సంతోష్ దంపతులు రూ. లక్ష విలువ చేసే రథాన్ని బుధవారం బహూకరించారు. దండి సుదర్శన స్వామి చేతుల మీదుగా రథం అందజేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, పల్లకీ సేవ, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో రామస్వామి, ఆలయ కమిటీ సభ్యులు ఉప్పరి లింగం, పత్తి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'నాపై వచ్చిన ఆరోపణలు అవాస్తవం'



పెద్దకొడప్‌గల్(జుక్కల్): తనపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని జుక్కల్ నియోజకవర్గ ఎస్సీ సెల్ చైర్మన్ సౌదాగర్ అరవింద్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ తనను అధిష్టానం సస్పెన్షన్ చేసిందని ఆరోపణలు చేస్తున్నారని అందులో నిజం లేదన్నారు. తన సేవలను గుర్తించిన పార్టీ అధిష్టానం జుక్కల్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నియమించిందని అన్నారు. కార్యక్రమంలో సంఘమేశ్వర్, అంకుష్ పాల్గొన్నారు.

సెలవులను సద్వినియోగం చేసుకోవాలి



బాన్సువాడ రూరల్: విద్యార్థులు దసరా సెలవులను సద్వినియోగం చేసుకోవాలని కొత్తాబాదికి చెందిన యువకుడు నాని అన్నారు. బుధవారం ఆయన గ్రామంలోని చిన్నారులకు ఒమేగా ఫైర్‌మినిస్టర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక కళాకారులతో చిన్నారుల కోసం ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. పాటలు, ఆటలు, డ్యాన్స్, డ్రాయింగ్ కాంపిటీషన్ నిర్వహించి బహుమతులు అందజేశారు. ఓ కళాకారుడు మోనో యాక్షన్‌ద్వారా విద్యార్థులను అబ్బుర పర్చాడు. అనంతరం వాక్యరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.



బాన్సువాడలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పోచారం



నాగిరెడ్డిపేట: కిచ్చన్నపేటలో కుంకుమార్చనలు..



మాగిలో దుర్గామాతను పూజిస్తున్న భక్తులు



నిజాంసాగర్: నర్వలో..



పిట్లం ఆర్యవైశ్య సంఘంలో..



ఎల్లారెడ్డి: కళ్యాణిలో పూజలు చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

చదువుల తల్లీ నమోస్తుతే..

జిల్లా వ్యాప్తంగా మండపాల్లో కొలువుదీరిన అమ్మవారిని భక్తులు భక్తిశ్రద్ధలతో పూజిస్తున్నారు. బుధవారం అమ్మవారు సరస్వతీమాతగా దర్శనం ఇచ్చారు. మండపాల నిర్వాహకులు ప్రత్యేక పూజలు, అన్నదానాలు చేపట్టారు. అమ్మవారిని కరెన్సీ నోట్లు, పండ్లతో అలంకరించారు. పలు మండపాల్లో కుంకుమ పూజ, హోమం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బాన్సువాలోని సరస్వతి ఆలయంలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పూజలు చేశారు. – సాక్షి నెట్‌వర్క్



దేవునిపల్లి: చైతన్య యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నెలకొల్పిన మండపంలో పూజలు చేస్తున్న భక్తులు



చిన్నమల్లారెడ్డిలో హోమం నిర్వహిస్తున్న భక్తులు



కామారెడ్డి పెద్దబజార్‌లో..



సదాశివనగర్: ధర్మారావ్‌పేట్‌లో రూ.3.30లక్షలతో అలంకరణ



దోమకొండలో..



బిచ్కుందలో..



భిక్కనూరులో అన్నదానం చేస్తున్న సభ్యులు



నాగిరెడ్డిపేట: సప్త చండీయాగం చేస్తున్న భక్తులు

భావితరాలకు చరిత్ర వివరించాలి



నాగన్నగారి మెట్ల బావిని పరిశీలిస్తున్న కేంద్ర సభ్యులు



ఆర్గొండలో ఫాంపాండ్‌ను పరిశీలిస్తున్న సభ్యులు



రాఘవపల్లిలో..

- నాగన్నగారి మెట్ల బావిని సందర్శించిన కేంద్ర జలశక్తి అభియాన్ బృందం

లింగంపేట: భావితరాలకు చరిత్రను వివరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కేంద్ర జలశక్తి అభియాన్ బృందం సభ్యులు అన్నారు. లింగంపేట మండల కేంద్రంలోని నాగన్నగారి మెట్ల బావిని బుధవారం సందర్శించారు. కాకతీయుల కాలంలో భూగర్భ జలాలు వృద్ధి చెందడానికి మెట్లబావులు, చేదబావులు తవ్వించే వారని దీంతో భూగర్భ జలాలు వృద్ధి చెందేవన్నారు. మెట్ల బావి 18వ శతాబ్దంలో నిర్మించగా అది కాలక్రమేనా శిథిలావస్థకు చేరిందన్నారు. గత కలెక్టర్ జితేష్ పాటిల్ చొరవతో ఇన్ఫోసిస్ సంస్థ వారు పునర్ నిర్మించి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. చారిత్రక కట్టడాలకు పునర్ వైభవం తీసుకురావడానికి ఫౌండర్ ఆఫ్ ది రేయిన్ వాటర్ ప్రాజెక్టు సంస్థ ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ బావుల ద్వారా నీటి నిల్వ సామర్థ్యం పెరుగుదుంతన్నారు. నాగన్నగారి బావి అద్భుత కట్టడమని అన్నారు. బావిని అభివృద్ధి చేసిన తీరును, విశిష్ఠతను స్థానిక ఎంపీడీవో కేంద్ర కమిటీ సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు బెంజిమెన్ కరుణాకరణ్, డీఆర్డీవో సురేందర్, ఎంపీడీవో నరేశ్, ఎంపీవో మలహరి, కార్యదర్శి శ్రావణ్‌కుమార్, ఏపీఎం శ్రీనివాస్, సీసీ గంగరాజం తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో..

రాజంపేట: మండల కేంద్రంలోని ఆర్గొండలో ఉన్న స్ప్రింగ్ సోలార్ పవర్ యూనిట్, ఆరెపల్లి జీపీలో ఉన్న ఫాంపాండ్‌ను కేంద్ర జల శక్తి అభియాన్ బృందం సభ్యులు పరిశీంచారు. జిల్లా గ్రామీణ అభివద్ధి శాఖ అధికారి సురేందర్, జిల్లా భూగర్భ జలాల శాఖ అధికారి సతీశ్ యాదవ్, డీఆర్డీఏ ఫైనాన్స్ మేనేజర్ రాంనారాయణ, ఎంపీడీవో రాజేశం, ఎంపీవో, ఏపీవో, టీఏలు, ఎఫ్ఏలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేటలో..

నాగిరెడ్డిపేట: మండలంలోని రాఘవపల్లిలో జలశక్తి అభియాన్ ద్వారా చేపట్టిన పనులను, ఇంకుడు గుంతలను కేంద్ర బృందం అధికారులు బుధవారం పరిశీలించారు. ఇంకుడుగుంత నిర్మాణం వల్ల కలుగుతున్న ప్రయోజనాల గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. దీంతోపాటు చెరువులో చేపట్టిన పూడికతీతను పరిశీలించారు. డిప్యూటీ సెక్రెటరీ బెంజిమన్ కరుణాకరణ్, డీఆర్డీవో సురేందర్, ఎంపీడీవో ప్రభాకర్‌చారి, ఏపీవో సాయిలు, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



కామారెడ్డి పెద్ద చెరువు వద్ద పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్



దోమకొండలో..

కామారెడ్డి టౌన్/ దోమకొండ/ లింగంపేట: సద్దుల బతుకమ్మ సందర్భంగా కామారెడ్డి పెద్ద చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్ల పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ బుధవారం పరిశీలించారు. బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేయడానికి తరలి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. శానిటరీ ఎస్సై పర్వేజ్, సిబ్బంది ఉన్నారు. దోమకొండ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో గురువారం నిర్వహించే సద్దుల బతుకమ్మకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంచాయతీ కార్యదర్శులు చూడాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ సూచించారు. మండలంలోని అంబారిపేట, లింగుపల్లి, సంఘమేశ్వర్ గ్రామాల్లో స్థానిక చెరువులను పరిశీలించారు. మాజీ ప్రజాప్రతినిధులు బాపురెడ్డి, ఫిరంగి రాజేశ్వర్, సలీం, నరేశ్, మురళి, సాయిలు, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు. లింగంపేట మండల సమీపంలోని పెద్దవాగు వద్ద సద్దుల బతుకమ్మ నిమజ్జనానికి జీపీ అధికారులు విద్యుత్ దీపాలను అమర్చారు. నిమజ్జనం చేసే పెద్దవాగు ప్రదేశంలో భూమిని చదును చేశారు. గ్రామస్తులకు ఇబ్బంది కలుగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో పేర్కొన్నారు. ఆయన వెంట కార్యదర్శి శ్రావణ్‌కుమార్, బట్టు సాయిలు ఉన్నారు.

జిల్లా గ్రంథాలయ చైర్మన్‌కు సన్మానం



గ్రంథాలయ చైర్మన్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు



అంబేడ్కర్ సంఘం నేతలు

కామారెడ్డి టౌన్/ భిక్కనూరు: నూతనంగా నియామకమైన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డిని ఓబీసీ సెల్ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ పుట్నాల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు కడెం ప్రవీణ్, నాయకులు బండి ప్రవీణ్, భాస్కర్ పాల్గొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ను అంబేడ్కర్ సంఘం నేతలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నేతలు కిరణ్, సుధాకర్, బాల్‌రాజు, సురేష్, పంచాక్షరీ, రవీందర్, ప్రసాద్, రమేశ్, మల్లేశ్ పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు..

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా నియామకమైన మారెడ్డి రజితను మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్‌తో పాటు పాలకవర్గ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు, కౌన్సిలర్ నీలకంఠం, నాయకులు విద్యాసాగర్, శ్రీనివాస్, పోచయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు..

భిక్కనూరు: వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియామకమైన కొడిప్యాక వెంకటేశంను ఆయన చిన్ననాటి మిత్రులు బుధవారం ఘనంగా సన్మానించారు. తమ మిత్రుడు వెంకటేశం మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియామకం కావడం సంతోషంగా ఉందని వారు అన్నారు. కార్యక్రమంలో తిప్పాపూర్ సింగిల్‌విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల మాజీ కన్వీనర్ ద్యావరి సాయిరెడ్డి, బాపురెడ్డి, మస్కట్ రాజిరెడ్డి, లక్ష్మీనారాయణ, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

బోరు మోటారు ప్రారంభం



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని 45వ వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన బోరు మోటారును మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పిట్ల వేణుగోపాల్, నాయకులు లక్ష్మీనారాయణ, కాలనీవాసులు పాల్గొన్నారు.

వైకుంఠధామం ఏర్పాటుకు చర్యలు

రామారెడ్డి: మండల కేంద్రంలో గ్రామస్తుల కోరిక మేరకు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు మరో వైకుంఠధామం ఏర్పాటుకు బుధవారం చర్యలు చేపట్టారు. మేజర్ జీపీ అయిన రామారెడ్డిలో 15వేల జనాభా ఉంటుంది. మండల కేంద్రంలో అంత్యక్రియలకు ఏర్పాడుతున్న ఇబ్బందులను గ్రామస్తులు ఇటీవల ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే మరో వైకుంఠధామం ఏర్పాటుకు నిధులకు సంబంధించిన నివేదికను కలెక్టర్‌కు పంపినట్లు తెలిపారు. ఏళ్లుగా అంత్యక్రియలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు ఎమ్మెల్యే చర్యలతో కష్టాలు తీరనున్నాయి.

డీఎస్సీలో మెరిసిన అఖిల



మాచారెడ్డి: మండలంలోని రాజఖాన్ పేటకు చెందిన సుంకోజి అఖిల మంగళవారం విడుదలైన డీఎస్సీ తుది జాబితాలో 978 ర్యాంక్ సాధించి ఎస్జీటీకి ఎంపికయ్యారు. బుధవారం సీఎం చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అఖిలను అభినందించారు. తమ గ్రామానికి చెందిన యువతికి ఉద్యోగం రావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

నీటిఎద్దడి నివారణకు చర్యలు



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపల్‌లో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ శ్రీకాంత్ తెలిపారు. పట్టణంలోని 2, 3వ వార్డులలో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సహకారంతో వేసిన బోరు బావులకు మోటార్లు బిగించి కాలనీ వాసులకు నీటి సరఫరాను బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈ వినోద్, కౌన్సిలర్ నీలకంఠం, కాంగ్రెస్ నాయకులు విద్యాసాగర్, ఇంతియాజ్, రఫీక్, శ్రీనివాస్, పోచయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



తాడ్వాయి: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అధికారులు, కాంగ్రెస్ నాయకులు బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రహీమొద్దీన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, శ్యాంరావు, రాంచంద్రం, సంజీవులు, సుధాకర్‌రావు, రాజు, శివాజీ, మోహన్ రెడ్డి, అఖిల్‌రావు, శ్రీకాంత్, జలందర్‌రెడ్డి, లక్ష్మణచారి తదితరులు పాల్గొన్నారు.

అగ్రవర్ణ పేదలకు ఈడబ్ల్యూఎస్ అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కామారెడ్డి టౌన్: అగ్రవర్ణ పేదలకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలు చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. భారతీయ విద్యార్థి మోర్చా ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైన వక్తలు మాట్లాడారు. 6 శాతం ఉన్న అగ్రవర్ణ పేదలకు 10శాతం రిజర్వేషన్ ఏ ప్రాతిపదికన అమలు చేస్తారో చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ సమగ్ర కుల గణన చేయాలని ఉద్యమాలు చేస్తున్నా పట్టించుకోవడంలేదని మండి పడ్డారు. తక్షణమే జనాభ ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజా, విద్యార్థి, ఉపాధ్యాయ తదితర సంఘాల నేతలు విఠల్, ఆకుల బాబు, నరేందర్, కొంగల వెంకటి, క్యాతం సిద్ధిరాములు, జగన్నాథం, గంగారాం, మల్లన్న, శివరాములు, భూమన్న తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



కామారెడ్డి టౌన్: ఎన్నికల సమయంలో దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఏవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చిప్ప దుర్గాప్రసాద్, నర్సింలు, నితీశ్‌రెడ్డి, రాజు, స్వామి, పోచయ్య, మల్లయ్య, రంగ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

58వ సారి రక్తదానం



రాజంపేట: మండల కేంద్రానికి చెందిన ప్రైవేట్ కళాశాల అధ్యాపకుడు బంధం ప్రవీణ్ కుమార్ అత్యవసర స్థితిలో ఉన్న ఓ మహిళకు రక్తదానం చేసి మానవత్వం చాటుకున్నారు. భిక్కనూరు మండలం తిప్పాపూర్‌కు చెందిన పవిత్రకు రక్తం అవసరం కావడంతో కుటుంబీకులు రక్తదాల సమూహాన్ని సంప్రదించగా ప్రవీణ్‌కుమార్ ముందుకు వచ్చి 58వ సారి రక్తదానం చేసి అందరి మన్ననలు పొందారు.

సంక్షిప్తం

ఓటరుగా నమోదు చేసుకోవాలి



ఎల్లారెడ్డిరూరల్: ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ మహేందర్‌కుమార్ అన్నారు. మండలంలోని ఆర్డీవో కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. పట్టభద్రులు నవంబర్ 6లోగా ఆన్‌లైన్‌లో ఓటరుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సామెల్, నర్సింలు, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో కష్టపడే వారికి గుర్తింపు



రామారెడ్డి: పార్టీలో కష్టపడే వారికి కచ్చితంగా గుర్తింపు లభిస్తుందని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నారెడ్డి మోహన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం కష్టపడే వారిని గుర్తిస్తోందని, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధైర్య పడొద్దని సూచించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఇసన్నపల్లి కాంగ్రెస్ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ



బాన్సువాడ: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ఆదర్శమని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. బాన్సువాడ డివిజన్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం బాన్సువాడ డివిజన్ సమీకృత కార్యాలయం వద్ద బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. వివిధ రకాల పువ్వులతో బతుకమ్మలను అలంకరించి మహిళా ఉద్యోగులు బతుకమ్మ ఆడారు. ఉద్యోగులతో పాటు బాన్సువాడ సబ్ కలెక్టర్ బతుకమ్మ ఆడారు. బతుకమ్మలను అందంగా తయారు చేసిన మహిళా ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జగన్ తదితరులు పాల్గొన్నారు.